ఉగాది పండుగ శోభ


పులివెందులలో రద్దీగా మారిన పూలంగళ్ల సర్కిల్

పులివెందుల టౌన్ : తెలుగు సంవత్సరాది తొలి తెలుగు పండుగ అయిన ఉగాది పండుగను ఘనంగా జరుపుకునేందుకు శనివారం పండుగ సరుకుల కోసం గ్రామాలనుంచి ప్రజలు పట్టణానికి బారులు తీరారు. దీంతో బస్సులు ప్రయాణీకులతో కిటకిటలాడగా, పులివెందులలో ఎక్కడ చూసినా పల్లెల నుంచి సరుకులకోసం వచ్చిన జనాలు కనిపించారు. పండుగ రోజు కొత్త బట్టలు ఇంట్లోని దేవుని మూల ఉంచి పల్లెం వేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఎక్కడ చూసినా బట్టల షాపులు వినియోగదారులతో కిటకిటలాడాయి. మహిళలు, పురుషులు బట్టలు కొనుగోలు చేశారు. రెడీమేడ్ షాపులు కళకళ్లాడాయి. ఉగాది పండుగ తెలుగు వారి తొలి పెద్ద పండుగ.. బంధువులు, రక్తసంబంధీకులు కలసి ఎంతో గొప్పగా చేసుకొనే పండుగ ఉగాది. గ్రామీణ ప్రాంత ప్రజలు ఉగాది పండుగను చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

జనాలతో కిక్కిరిసిన పూలంగళ్ల సర్కిల్

పులివెందులలోని ప్రధానంగా పూల అంగళ్లు, మెయిన్‌బజార్ ప్రాంతంతోపాటు పాత బస్టాండు సర్కిళ్ల వద్ద జనాలు సందడి కనిపించింది. బంతి పూలు కిలో రూ.100 నుండి ఆపైన అమ్మారు. పూల అంగళ్ల ప్రాంతంలో రద్దీ ఎక్కువ కావడంతో ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వేంపల్లెలో సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : ఉగాది పండుగను పురస్కరించుకుని సింహాద్రిపురం వీధులలో ప్రజలు శనివారం సాయంత్రం టెంకాయలు, మామాడి ఆకులు, పూల దండలు కొనుగోలు చేస్తూ కనిపించారు. పండుగను ఈ ప్రాంత ప్రజలు వైభవంగా నిర్వహిస్తారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : తెలుగు సంవత్సరాది పురస్కరించుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాలనుంచి ప్రజలతో మార్కెట్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఆదివారం ఉగాది పండుగ కావడంతో మామిడి తోరణాలు, కూరగాయాలతోపాటు నూతన వస్త్రాల కొనుగోలు కోసం ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చారు. దీంతో మార్కెట్‌వీధిలో పూర్తిగా ట్రాఫిక్ జాం ఎర్పడింది. కూరగాయాలు, పూల వ్యాపారులు, వస్త వ్యాపారాలు అన్ని ఒకే ప్రాంతంలో ఉండటంతో భారీగా వాహనాలు స్తంభించి పోయాయి.


జమ్మలమడుగులో ప్రజలతో కిక్కిరిసిపోయిన మార్కెట్

లింగాలలో..

లింగాల : మండలంలో శ్రీవిశ్వావసు నూతన తెలుగు సంవత్సర ఉగాది పండుగ నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. అన్ని గ్రామాల్లో ఇంటింటా పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అల్లుళ్లు, ఆడబిడ్డలు, బంధు, మిత్రులతో ఉగాది పచ్చళ్లు, పిండి వంటలు, మామిడి తోరణాలతో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ పండుగల ఉత్సవాలను విద్యార్థులతో కలిసి నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి పండుగ విషయాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో ముందస్తు పండుగ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పండుగల గొప్పదనంపై విద్యార్థులు వారి వారి భాషల్లో ప్రసంగాలు చేశారు.

వేములలో

వేముల : మండలంలోని గ్రామాలన్ని ఉగాది పండుగకు ముస్తాబయ్యాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇళ్లకు రంగులు వేయడం, సున్నాలు వేయడం, శుభ్రం చేసుకోవడంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేసుకున్నారు.

యువకుడు అదృశ్యం


గురుప్రసాద్ (ఫైల్)

జమ్మలమడుగు : మైలవరంలో నివసిస్తున్న గద్దె గురుప్రసాద్ ఈనెల 27వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ భార్య గద్దె మానస ఫిర్యాదు చేసినట్లు మైలవరం ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. గురుప్రసాద్ గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్ళిపోయాడన్నారు. ఇతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గురుప్రసాద్ తొర్రివేముల సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యదర్శి ఇంటిపై దాడికి నిరసన

ముద్దనూరు : జిల్లాలోని వీరపునాయనిపల్లె మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంటిపై జరిగిన దాడి గర్హనీయమని మండల పంచాయతీ కార్యదర్శులు శనివారం నిరసన వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యదర్శికి సంఘీభావంగా మండలంలోని కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. దాడులను అరికట్టి దోషులను శిక్షించాలని వారు స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

తిరుమలలో మద్యం విక్రయాలా..

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథశర్మ ఆగ్రహం



కమలాపురం : అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయించడం తిరుమల పవిత్రతకు, ప్రతిష్టకు పూర్తిస్థాయిలో భంగం కలిగించినట్లేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సత్య సాయినాథ శర్మ ధ్వజమెత్తారు. శనివారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల క్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం విక్రయాలు జరపడం, పోలీసులు దాడి చేసి మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం చూస్తుంటే తిరుమల పవిత్రత మీద కూటమి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నట్లు అర్థం అవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుమలలో ఒక చిన్న పొరపాటు జరిగితే నానా హంగామా చేసే కూటమి పార్టీ నాయకులు నేడు మద్యం విక్రయాలు జరుగుతున్న తీరుపై ఏమి సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. తిరుమల క్షేత్రం కొంత కాలంగా మద్యం బాబులకు నిలయంగా మారిందని చెప్పడానికి అనేక నిదర్శనాలు ఉన్నాయన్నారు. ఇటీవల మాడ వీధులలో కొందరు మద్యం తాగి భక్తులను నానా దుర్భాషలాడుతూ ఇబ్బంది పెట్టిన విషయం మీడియాలో ప్రత్యక్షంగా చూడటం అందరికి తెలిసిందేనన్నారు. తిరుమలలో లడ్డూ వివాదాన్ని గోరంతను కొండంతలు చేసిన కూటమి నేతలు నేడు నోరు మెదపకపోవడం హిందూ సమాజానికి సిగ్గు చేటన్నారు. తిరుమలలోని స్థానికులు నివాసమున్న బాలాజీ నగర్‌లో రమేష్ అనే వ్యక్తి బెల్ట్ షాపు ద్వారా మద్యం విక్రయిస్తూ శనివారం పట్టుబడటం ప్రభుత్వ అధికారుల, నాయకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

నేడు, రేపు పన్నులు చెల్లించవచ్చు

కమలాపురం : ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో కూడా ఆస్తి పన్నులు చెల్లించవచ్చని కమలాపురం నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ ఆస్తి పన్నులు చెల్లించుటకు నేడు, రేపు రెండు రోజులు పండుగ శెలవులు ఉన్నప్పటికి నగర పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కౌంటర్లు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయన్నారు. నగర పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆయన తెలిపారు.

విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, తదితరులు

పులివెందుల టౌన్ : తమ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జోజిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో లోకల్ సర్వీసెస్ మొబైల్ యాప్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ ఇంటర్వ్యూలకు 120 మంది విద్యార్థులు హాజరు కాగా.. ఇందులో నైపుణ్యాలను ప్రతిభను పరిశీలించి 26 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఆంటోనిస్వామి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వన, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సహకారంతో సమస్యల పరిష్కారం

వేంపల్లె : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. ఈ మేరకు శనివారం జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సి. ఓబులమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని వేంపల్లె, తొండూరు, వేముల, పెండ్లిమర్రి, లింగాల, మైలవరం తదితర ప్రాంతాలకు మోటర్ పంప్ సెట్, హెచ్‌డీ పీపీ పైపులైన్, సీసీ డ్రెయిన్లకు నిధులు మంజూరయ్యాయి. అందులో వేంపల్లి మండలానికి రూ.29 లక్షలు, తొండూరు మండలానికి రూ.7లక్షలు, పెండ్లిమర్రి మండలానికి రూ.13 లక్షలు, లింగాల మండలానికి రూ.1.50లక్షలు, మైలవరం మండలానికి రూ.7.50లక్షలు, వేముల మండలానికి రూ .4లక్షలు జిల్లా పరిషత్ నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామంలో ఉన్న బక్కంబాయి చెరువుకు హెచ్‌డీ పీపీ పైప్ లైన్ పూర్తయితే సాగు, తాగునీటికి సమస్య పరిష్కారమవుతుంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : పట్టణానికి దూరంగా ఉన్న రైల్వే స్టేషన్ సమీపంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు ప్రాంతం నుంచి నిత్యం వందల మంది విద్యార్థులు కడపకు వెళ్తుంటారు. సాయంత్రం తిరిగి వచ్చె సమయానికి వాహనాలు కనిపించకుండా పోతున్నాయన్నారు. ఇప్పటికే రైల్వేస్టేషన్ వద్ద స్కూటర్ దొంగతనాలు ఎక్కువగా పెరిగిపోతున్నాయి. వాటిని నివారించటానికి రైల్వేస్టేషన్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించండి

పులివెందుల టౌన్ : ఈనెల 31వ తేదీలోపు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ట్యాక్స్ చెల్లింపుదారులు, పాత బకాయిలు, జీఎస్టీ బకాయిలు ఉన్న వారు చెల్లిచాలని మున్సిపల్ వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానందరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలుపుతూ ఆది, సోమవారాలలో కూడా తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని ట్యాక్స్ చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి


సబ్‌జైలును పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

పులివెందుల రూరల్ : స్థానిక సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను శనివారం సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ సందర్శించి రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం తదితర వాటి గురించి వివరించారు. అలాగే ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 15,100 లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్‌పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే మండల న్యాయ సేవా సమితి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం


వక్ఫ్ బిల్లు వ్యతిరేక కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

పులివెందుల : వక్ఫ్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకమని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంటులో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మిగిలిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు వక్ఫ్‌బిల్లును వ్యతిరేకించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు ప్రధాన కార్యదర్శి షామీర్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలోని మసీదులో మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేక కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. వక్ఫ్ బిల్లుపై మరోసారి పునరాలోచన చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో మదీనా మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు బాధ్యతగా చేపట్టాలి


ఓపెన్‌ఫోరంలో రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ముద్దనూరు : ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను బాధ్యతగా చేపట్టాలని డ్వామా ప్రాజెక్టు డైరక్టర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఉపాధి కార్యాలయంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు గాను ఓపెన్‌ఫోరం నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి హాజరైన పీడీ సామాజిక తనిఖీ రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడకుండా పారదర్శకంగా వుండాలని, పలుచోట్ల చనిపోయిన మొక్కలను పునరుద్ధరించాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో మండంలో సుమారు రూ.10.40 కోట్ల వ్యయంతో వివిధ పనులు చేపట్టినట్లు, సామాజిక తనికీలో భాగంగా రూ.26 వేల సొమ్మును తక్షణమే రికవరీ చేసినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముకుందరెడ్డి, ఉపాధి ఏపీవో గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

30 సిమెంటు బెంచీల వితరణ


భక్తుల కోసం దాతలు అందజేసిన సిమెంటు బెంచీలు

చక్రాయపేట : గండి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సురభి గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన సురభి నాటక మండలి వ్యవస్థాపకుల కుటుంబీకులు 30 సిమెంటు బెంచీలను విరాళంగా అందజేశారు. సురభి నాటక మండలి పోషకుడు అల్లపురెడ్డి చెన్నారెడ్డి, నరసింహారెడ్డిల జ్ఞాపకార్థం సరోజ, జయచంద్రారెడ్డి, అటవీ శాఖ అధికారులు బెంచీలను అందజేశారు. అలాగే గండిలో భక్తులకు కాళ్లు కాలకుండా ఉండేందుకు కూల్ పెయింట్ వేయిస్తామన్నారు. దాతలకు ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, జెడ్పీటీసీ శివప్రసాదరెడ్డిలు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలు

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి గ్రామ నడిగడ్డ శివాలయం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ నరేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. తొండురు మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన శివశంకర్, వెంకటరణలు ప్రొద్దుటూరుకు బైక్‌లో వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. పొట్లదుర్తి గ్రామం శివాలయం వద్దకు రాగానే ఆటో.. బైక్‌లు ఢీకున్నాయి. శివశంకర్, వెంకటరణలకు కాళ్లు, చేతులు విరిగి రక్త స్రావం అధికంగా జరిగిందన్నారు. స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మానవత స్వచ్ఛంద సంస్థ విరాళం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పెన్షనర్ల సంఘ కార్యాలయంలో శనివారం మానవత సంస్థ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సంస్థ తరపున మానవతా సంస్థ ఆవిర్భావం నుంచి ఫ్రీజర్ బాక్సులను అవసరమైన వారికి అందించిన మల్లారెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. అలాగే కాశీయాత్రను కాలినడకన దిగ్విజయంగా చేసిన మడూరు శేషయ్య, రిటైర్డు ఆర్మీ ఉద్యోగి రమణారెడ్డి, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్నికైన సారెడ్డి చంద్రశేఖరరెడ్డిని శనివారం సంస్థ సన్మానించింది.

టిప్పర్లు పట్టివేత

పెండ్లిమర్రి : మండలంలోని గొందిపల్లె గ్రామ రెవెన్యూ పొలం సర్వే నంబర్ 459–1లోని ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమార్కులు అక్రమంగా మట్టి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం అర్ధరాత్రి ఎస్ఐ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో రెండు మట్టి టిప్పర్లు పట్టుబడ్డాయి. పట్టుబడ్డ వాటిని సీజ్ చేసి పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కొండగంగమ్మ తిరునాల

పెండ్లిమర్రి : నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండగంగమ్మ తిరునాల ఉత్సవాలు రెండవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆకుపూజ, అభిషేకాలకరణ కార్యక్రమాలు నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి ఆలయ అవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు బండలాగుడు పోటీలు

కొండగంగమ్మ తిరునాల సందర్భంగా ఆలయ కార్యనిర్వాహకులు ఆదివారం ఉదయం ఎద్దులచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు మొదటి బహుమతి రూ.1లక్ష, మిగిలినవారికి 9 బహుమతులు అందజేస్తామన్నారు.